సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 28 । జూలై । 2023



ప్రజా ప్రయోజిత సేవలపై అవగాహన పెరగాలి

ప్రజా ప్రయోజిత న్యాయ సేవలపై అధికారుల్లో అవగాహన పెరగాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ అన్నపూర్ణ తెలిపారు. -8లో..



తూకాల్లో మోసం చేస్తే చర్యలు

వ్యాపారులు తూకాల ద్వారా వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.9/25.2

జిల్లాలో గురువారం 25.2 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

చురుగ్గా రీ సర్వే మూడోదశ



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులు మొదటి, రెండు దశలు పూర్తి చేశామని, మూడో దశ పనులు చురుగ్గా సాగుతున్నాయని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సీసీఎల్ఏ సాయిప్రసాద్ గురువారం జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం అమలు, రీ సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్, గ్రౌండ్ టు థింగ్ అంశాలపై కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెండోదశ రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు కలెక్టర్ బదులిస్తూ నిర్దేశిత లక్ష్యం మేరకు రీ సర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. గురువారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 426 గ్రామ సచివాలయాల భవనాలకుగాను 347 పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగతా వాటిని సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. నులి పురుగుల నివారణకు అన్ని స్కూళ్లలో ఆగస్టు 10న మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత వైమానిక దళంలో అగ్నివీర్ వాయు ఎంపికల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 17వ తేదీలోపు అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవివాహితులైన యువతీ, యువకులు 27-06-2003 నుంచి 27-12-2006 మధ్య పుట్టినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్/10ప్లస్2 లో మ్యాథమాటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. లేదా మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్‌సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నందు మూడు సంవత్సరాల ఇంజినీరింగ్ డిప్లొమాతో పాటు ఇంగ్లీషు సబ్జెక్టు నందు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పురుష అభ్యర్థులు ఎత్తు 152.5 సెం.మీ., మహిళలు 152 సెంటీమీటర్లు ఉండాలన్నారు. వయసుకు తగ్గ బరువు ఉండాలని సూచించారు. పూర్తి వివరాలకు వాయుసేన వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు..

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) 2023–24 విద్యా సంవత్సరానికి ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కో ఆర్డినేటర్ చెప్పలి రాజారావు తెలిపారు. వివరాలకు 91820 99672 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

బీఈడీ పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షలను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలోని పుష్పగిరి బీఈడీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో విద్యార్థుల హాల్‌టికెట్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య

- జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన కింద 10 మందికి రూ. 1.09 కోట్లు
- కలెక్టర్ విజయరామరాజు



విద్యార్థులు, వారి తల్లులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పేద విద్యార్థులకు వరమని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విదేశీ విద్యా దీవెన రెండోవిడత లబ్ధి మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి అధికారులు వీక్షించారు. వీసీ ముగిశాక కలెక్టర్ అర్హులైన పది మంది విద్యార్థులకు రెండో విడత కింద రూ. 1,09,54,398 మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని ప్రభుత్వం కలిస్తోందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ముఖ్యమంత్రి విప్లవాత్మక మార్పులు చేపట్టారన్నారు. ప్రతిభావంతులైన పేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఈబీసీ కాపు విద్యార్థులకు వైద్య విద్యతోపాటు ఎమ్మెస్సీ, ఎంటెక్ అభ్యసించేందుకు అవకాశం కలిగిందన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన 200 యూనివర్సిటీల్లో చదువుకునే భాగ్యం దక్కిందన్నారు. తల్లి దండ్రుల ఆదా యం ఏడాదికి రూ.8 లక్షల్లోపు కలిగిన విద్యార్థులు దర ఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. ఎంపికైన వారికి ప్రభుత్వం ఒక ఏడాదికి ఒక్కొక్కరికి రూ. 70 లక్షల వరకు నాలుగు విడతల్లో విడుదల చేస్తుందన్నారు. జిల్లాలో పది మంది దరఖాస్తు చేసుకోగా, అందులో ఒకరు ఓసీ, ఏడుగురు ఈబీసీలు, ఒక మైనార్టీ, ఒక బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. విదేశీ విద్యా దీవెన లబ్ధి పొందడంలో ఏవైనా సమస్యలు ఉంటే 1902 కాల్ సెంటర్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ, బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య, సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, విద్యాశాఖ అధికారులు, విదేశాల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఫార్సులు లేకుండా సాయం అందింది



ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి విదేశాల్లో లక్షలు వెచ్చించి చదువుకునే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కల్పించారు. విదేశీ విద్యా దీవెన ఆయనిచ్చిన వరంగా భావిస్తున్నాం. మా కుమారుడు చరణ్‌రెడ్డి కజకిస్తాన్ దేశంలో అల్–ఫరాబీ ఖజహ్ నేషనల్ యూనివర్శిటీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసించాడు. ప్రభుత్వం నుంచి రూ. 24 లక్షలు మంజూరు కాగా, ప్రస్తుతం మొదటి విడతగా రూ. 3.62 లక్షలు విడుదల చేశారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా ప్రభుత్వం నుంచి సాయం అందింది.

– ప్రతాప్‌రెడ్డి, గోపాలపురం, దువ్వూరు

విద్యా ప్రదాత జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా పాలిట విద్యా ప్రదాతగా మారారు. గత డిసెంబరులో నా భర్త అనారోగ్యంతో మరణించాడు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక భరోసాతో కుమారుడిని కష్టపడి చదివిస్తున్నా. మా అబ్బాయి సాయికుమార్‌రెడ్డి యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ మేరిల్యాండ్ కాలేజీలో సైబర్ టెక్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చదువుతున్నాడు. మొత్తం రూ. 32 లక్షలు మంజూరు కాగా, మొదటి, రెండవ విడత కలిపి రూ. 9.69 లక్షలు విడుదలైంది.

– వై.సుమలత, బలపనూరు, సింహాద్రిపురం మండలం

జీవితాంతం రుణపడి ఉంటాం



మా అమ్మా యి శ్రావణి యూఎస్ఏలోని యూ నివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలో కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చదువుతోంది. మొత్తం రూ. 49.45 లక్షలు మంజూరు కాగా, ప్రస్తుత మొదటి, రెండో విడత కలిపి రూ. 13.53 లక్షలు విడుదల చేశారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఎ.శ్రీదేవి, పెద్దచియ్యపాడు, చాపాడు మండలం

ఇంత గొప్ప పని ఏ సీఎం చేయలేదు



మాలాంటి పేద వారికి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా ఆదుకుంటున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇలాంటి గొప్ప పనిచేయలేదు. నేను ఖజకిస్తాన్‌లో అల్ ఫరాబి కజాహ్ నేషనల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నాకు రూ. 30 లక్షలు మంజూరైంది. మొదటి విడతలో రూ. 7.50 లక్షలు వచ్చింది.

– గోసుల వెంకట చరణ్, చెన్నూరు

ఆర్టీసీ స్టార్‌లైనర్ బస్సు చార్జీల తగ్గింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె–హైదరాబాదు–సికింద్రాబాద్‌కు నడుపుతున్న ఆర్టీసీ స్టార్‌లైనర్ బస్సులో చార్జీలు తగ్గించినట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో తగ్గింపు ధరలు వర్తిస్తాయన్నారు. లోయర్‌బెర్త్ మదనపల్లె–హైదరాబాద్ రూ.1080, మదనపల్లె–సికింద్రాబాద్ రూ.1120, అప్పర్‌బెర్త్ మదనపల్లె–హైదరాబాద్ రూ.1000, మదనపల్లె–సికింద్రాబాద్ రూ.1030, లోయర్ బెర్త్‌కు రూ.250, అప్పర్‌బెర్త్‌కు రూ.230 తగ్గించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

పాము కాటుకు గురైన బాలిక మృతి


భవ్యశ్రీ (ఫైల్)

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో హోంగార్డు రామాంజనేయులు పిల్లలు నవదీప్, భవ్యశ్రీలు రెండు రోజుల క్రితం పాము కాటుకు గురైన విషయం తెలిసిందే. అదే రోజు నవదీప్ మృతి చెందాడు. నవదీప్ చెల్లెలు భవ్యశ్రీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఒకేసారి ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో తల్లి దండ్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రేపు పీరుల్లామాలిక్ గంధం


కడప పెద్దదర్గా

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ దర్గాలో శనివారం ఖ్వాజా యే ఖాజుగ నాయబ్-యే-రసూల్ అతాయే రసూలుల్లా హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రి గంధోత్సవం నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్ అమీరుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గురువు మజార్‌పై గంధ సమర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దర్గా ఆవరణాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలు, పూలతో అలంకరించనున్నట్లు ఆయన వివరించారు.

అండర్-19 అంతర్ జోన్ మ్యాచ్‌లు ప్రారంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఏసీఏ అండర్-19 అంతర్ జోన్ మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి మ్యాచ్‌లో నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 61 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. జట్టులోని టి.వి.సాయి శ్రావణ్ 51, సుశాంత్ 47 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్ సాయిఆర్థిత్‌రెడ్డి 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

• రెండో రోజు.. డిగ్రీ కార్యాలయం వంతు..!


డిగ్రీ విద్య ఆర్‌జేడీ కార్యాలయంలో ఊడిన పైకప్పు


కింద పడిన పెచ్చులు

కడప నగరంలోని ప్రగతి భవన్‌లో ఏర్పాటైన కార్యాలయాల్లో పైకప్పు ఊడి పడుతుండటంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయం పైకప్పు పెచ్చులు ఊడి కిందపడిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం ప్రగతిభవన్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న డిగ్రీ విద్య ఆర్‌జేడీ కార్యాలయంలో పైకప్పు ఊడిపడింది. సాయంత్రం 4 గంటల సమయంలో సీలింగ్ పీఓపీ ఊడి పడింది. అదే సమయంలో సిబ్బంది అంతా కార్యాలయంలోనే ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతోపాటు గోడలు సైతం బీటలు బారి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. – వైవీయూ

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం


వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : చెన్నూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన వల్ల మేలు జరిగి ఉంటే ఓట్లు వెయ్యండని నిర్భయంగా ప్రజలను అడుగుతుంటే.. అలా అడిగే ధైర్యం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఉందా అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు నాయుడు పాలనలో ఆయన ప్రజలకు చేసిన వాగ్దానాలలో ఒకటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు మళ్లీ మినీ మ్యానిఫెస్టో అంటూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్రప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్‌ఆర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గణేష్‌రెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ అన్వర్ బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామ కంఠ స్థల పట్టాలు.. ఓ మైలురాయి

వల్లూరు : ప్రజలు కేవలం అనుభవించడానికి తప్ప ఇతరత్రా దేనికీ ఉపయోగపడని గ్రామ కంఠ స్థలాలను అనుభవంలో వున్న వారికి పట్టాలు మంజూరు చేసే కార్యక్రమం దేశ చరిత్రలో అతి ముఖ్యమైన మైలురాయని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా వల్లూరు మండలంలోని జంగంపల్లె గ్రామ ప్రజలకు గ్రామ కంఠ భూముల పట్టాల మంజూరు కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠ భూములకు సంబంధించి సంబంధిత హక్కుదారులకు పట్టాలను ఇవ్వడం వల్ల.. వారు శాశ్వత హక్కు పొందుతారని తెలిపారు. ఆ భూమిపై క్రయవిక్రయాలతోపాటు రుణాలు పొందడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మన జిల్లాలో ప్రొద్దుటూరులోని దొరసానిపల్లె, వల్లూరు మండలంలోని జంగంపల్లె గ్రామాలు ఈ కార్యక్రమం కింద మొదట ఎంపికయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా విడతల వారీగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జంగంపల్లె గ్రామానికి చెందిన 51 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మస్తాన్ వలీ, తహసీల్దార్ శంకర్‌రావు, ఎంపీడీవో జుబేద, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, జెడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, సర్పంచ్ చెన్నమ్మ, ఎంపీటీసీలు గంగయ్య, సుబ్బరాయుడు, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, బాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే సాయం


ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో ప్రమీళకు రూ.10 లక్షల నగదు ఇస్తున్న ఎంపీపీ

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామానికి చెందిన బండి ప్రభాకర్ (బాబు) సతీమణి ప్రమీళకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఉప్పరపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గుండె పోటుతో బాబు గత నెలలో మరణించారని అన్నారు. ఇప్పటికే అప్పులతో కుటుంబం చాలా ఇబ్బందులు పడిందని, బాబు భార్య ప్రమీళ వార్డు మెంబర్‌గా ఉన్నారన్నారు. వీరికి కొడుకు, కుమార్తె ఉన్నారన్నారు. సాధారణంగా ఇప్పటి నాయకులు.. కార్యకర్తలు ఎవరైనా మరణిస్తే అలా వెళ్లి పూలమాల వేసి పరామర్శించడం జరుగుతోందన్నారు. సంపాదించిన డబ్బు మన వెంట తీసుకుపోలేమనే సత్యాన్ని గ్రహించిన తాను చేతనైన సాయం చేయడం నేర్చుకున్నానన్నారు. ఎన్నో మార్లు ఎంతో మందికి సాయం అందిస్తున్నానని తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఇటీవల పలువురు మృతి చెందారని వారందరికి ఆర్థిక సహాయం అందించిన రాచమల్లు శివప్రసాదరెడ్డి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సానపురెడ్డి రమణారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ఎంపీటీసీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రులకు చేయూత

దాతల ఆర్థిక సాయం


సీఏ విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న లయన్ ఖాసింఖాన్

సాక్షి ఎఫెక్ట్..

కడప కల్చరల్ : సరస్వతీపుత్రులు వెన్నపూస రాజేష్ రెడ్డి, యుగంధర్‌రెడ్డిలకు చేయూత లభించింది. గురువారం 'సాక్షి'లో 'సరస్వతీపుత్రులకు లక్ష్మీకటాక్షం కరువు' శీర్షికన ఆ ఇద్దరు విద్యార్థులు తమ సీఏ చదువు కొనసాగించేందుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారిన వైనంపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన విద్యావేత్త, సీనియర్ ఆడిటర్ లయన్ పి.ఖాసింఖాన్ 'సాక్షి' ప్రతినిధుల ద్వారా కడప నగరం రవీంద్రనగర్‌లోని ఆ విద్యార్థులను వారి తల్లితో సహా తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. వారి చదువు, ఆర్థిక స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏటా రూ.20 వేలు ఖర్చవుతుందని వారు చెప్పగా, నాలుగేళ్లపాటు ఆ ఖర్చు తాను భరిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే తొలి విడత సొమ్మును నగదు రూపంలో అందజేశారు. బాగా చదువుకుని ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడాలని, మరికొందరు ఇలాంటి విద్యార్థులకు సాయపడాలని సూచించారు. సీఏ చదువుకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఆర్థిక పరిస్థితి చదువుకు అడ్డుకాదని నిరూపించాలని వారికి తెలిపారు. పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులతో సీఏ కోర్సు పూర్తి చేయాలని, ఈ విషయంగా ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తనకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు రాజేష్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, వారి తల్లి వెన్నపూస లక్ష్మిదేవి.. ఖాసింఖాన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన కుమారుడు లయన్ మన్సూర్ అలీఖాన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు పోతుల వెంకట్రామిరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజులు కూడా ఆ విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు. విద్యావేత్త ఆదినారాయణరెడ్డి, లయన్ పద్మప్రియ చంద్రారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి మేధావులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జీపీడీ క్రిస్టి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పిల్లలను ప్రపంచ స్థాయి మేధావులుగా తీర్చిద్దడంలో కేంద్రీయ విద్యాలయాలు ఎంతో కృషి చేస్తున్నాయని హైదరాబాదు సీఆర్‌పీఎఫ్ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ జీపీడీ క్రిస్టి పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 29వ తేదీన దేశ ప్రధాన నరేంద్రమోదీ ఐటీపీఓ ప్రారంభించనున్న నేపథ్యంలో.. గురువారం కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజారాణితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా 2022-23 సంవత్సరానికి దేశవ్యాప్తంగా 49 కేంద్రీయ విద్యాలయాల్లో 3, 4, 5 ఏళ్ల వయసు గల పిల్లల కోసం బాలవాటిక తరగతులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దీని కింద 5477 మంది పిల్లలు మూడవ తరగతిలో ప్రవేశం పొందారన్నారు. 2023-24 సంవత్సరానికి 500 స్కూల్స్‌లో బాలవాటిక తరగతులు ఏర్పాటు చేయడమైందన్నారు. ఇందులో భాగంగా కడప కేవీ కూడా ఉందన్నారు. 8వ తరగతి నుంచి పిల్లల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టును ప్రవేశ పెట్టడమైందన్నారు. దేశవ్యాప్తంగా 228 కేవీలలో పీఎం కేవీవై కింద విద్యా మంత్రిత్వశాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పైలెట్ ప్రాజెక్టులో పాఠశాల సమయం తర్వాత విద్యా రహిత నైపుణ్యం కోసం స్కిల్ హబ్‌లను ప్రారంభించినట్లు చెప్పారు. కేవీకే ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలను పెంపొందించేందుకు నిష్ఠ-1, 2, 3 ద్వారా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. కడప కేవీకే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజారాణి మాట్లాడుతూ 2023-24 ఏడాదికి కడప కేంద్రీయ విద్యాలయం ప్రైమినిస్టర్ స్కూల్ రైజింగ్ ఇండియా కింద ఎంపికైందన్నారు. దీంతో స్కూల్ అభివృద్ధికి సంబంధించి వర్చువల్ లాబ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు నిధులు విడుదల అవుతాయన్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు నిపుణ్ భారత్ కింద శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మెంటిఫోర్టు స్కూల్ ప్రిన్సిపాల్ అమృతరాజ్, రామక్రిష్ణమిషన్ ఉపాధ్యాయురాలు కేవీ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ గుర్తించరూ..!


మైదుకూరులో వృద్ధుడి మృతదేహం

మైదుకూరు : మైదుకూరులో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ గుర్తించాలని అర్బన్ సీఐ బీవీ చలపతి కోరారు. గురువారం స్థానిక కడప రోడ్డులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం గేటు వద్ద సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. ఈయన తెల్లని చొక్కా, తెల్లని పంచె కట్టుకుని నెరిసిన గడ్డంతో ఉన్నాడు. ఎవరైనా ఈ వృద్ధుడిని గుర్తిస్తే మొబైల్ నంబర్ 9121100618కు ఫోన్ చేసి తెలియజేయాలని అర్బన్ సీఐ కోరారు.

మంగపట్నం సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం గ్రామ పరిధి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సీఐ నరేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సబ్‌స్టేషన్ సమీపంలో కంప చెట్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి అస్తిపంజరంగా మారింది. మగ వ్యక్తి మృతదేహమని, ఎముకలు మాత్రమే మిగిలి వున్నాయని, నీలి రంగు ప్యాంటు ధరించాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా ప్రయోజిత సేవలపై అవగాహన పెరగాలి


మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప అర్బన్ : ప్రజా ప్రయోజిత న్యాయ సేవలపై అధికారుల్లో అవగాహన పెరగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ, కడప శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ తెలిపారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాసదన్‌లో గురువారం అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రయోజిత సేవల్లో రవాణా, పోస్టల్, టెలిఫోన్, విద్యుత్, నీరు సరఫరా, ప్రజా సంరక్షణ, పారిశుద్ధ్యం, ఆసుపత్రి, డిస్పెన్సరీ, బీమా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యా లేదా విద్యాసంస్థలు, హౌసింగ్, రియల్ ఎస్టేట్ సేవలు వున్నాయన్నారు. ఇరు వర్గాల మధ్య వివాదంలో వున్న విషయాన్ని సామరస్య పూర్వక, అర్హతల ఆధారంగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఇరు వర్గాలు సెటిల్‌మెంట్‌కు రాకుంటే, మెరిట్‌ల ఆధారంగా అవార్డులను ఆమోదించడానికి శాశ్వత లోక్ అదాలత్‌లకు న్యాయనిర్ణేత అధికారం వుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లు సంబంధిత జిల్లా ప్రధాన కార్యాలయంలో న్యాయసేవాసదన్ భవన సముదాయాల్లో పని చేస్తున్నాయన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం 1987లోని సెక్షన్ -22ఏలో పేర్కొన్న అన్ని సేవలకు సంబంధించి, సేవా లోపం, పరిహారం కోసం క్లెయిమ్, డబ్బు రికవరీ మొదలైన వాటికి సంబంధించిన వివాదాలను శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరించగలదన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వ్యాపారులు తూకాల ద్వారా వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని ఖాజీపేట, కమలాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో పలు దుకాణాల్లో తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఎక్కువగా బియ్యం తుకాల్లో వినియోగదారులను మోసం చేస్తున్నారని తెలిపారు. బియ్యం 25 తూకం ఉండాల్సి ఉంటే 24 కేజీలు మాత్రమే ప్యాక్ చేసి అమ్ముతున్నారన్నారు. వ్యాపారులు తూకాల్లో మోసం చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీల్లో 5 దుకాణాలపై కేసులు నమోదు చేసి రూ.60 వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో తూనికల కొలతల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగం శ్రేయస్సే ప్రభుత్వాల లక్ష్యం


మాట్లాడుతున్న ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : రైతుల శ్రేయస్సే పరమావధిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నాగార్జున ఫర్టిలైజర్స్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా 14వ విడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసే కార్యక్రమాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా రైతులకు టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.13,500 నగదును పీఎం కిసాన్, రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాయని తెలిపారు. అలాగే ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి విత్తు నుంచి విక్రయం వరకు అన్ని రకాల సేవలు అందిస్తున్నారన్నారు. బీజేపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశానికి రైతే వెన్నుముక అని భావించి ఏటా రూ.6 వేలు ఇస్తున్నారన్నారు. అలాగే రైతుల శ్రేయస్సు కోసం కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేశారన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఉత్పత్తులన్నీ ఒకే చోట లభించే విధంగా 1.25 లక్షల ఎరువుల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరస్వతి, కోరమాండల్ కంపెనీ ప్రతినిధి నాగశివారెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలుకు చెందిన సతీష్(55) కుటుంబ తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఆయన కుమారుడు రామకుమార్ నంబర్ 100కు డయల్ చేసి తన తండ్రి సెల్‌ఫోన్ నంబర్ చెప్పడంతో.. లోకేషన్ ఆధారంగా గుర్తించారు. ఎస్‌ఐ సిబ్బందితోపాటు 20 నిమిషాల్లో కనుమలోపల్లె సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నారు. పట్టాలపై పడుకున్న సతీష్‌ను లేపి, ఇలాంటి అఘాయిత్యాలు చేసుకోవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన కుటుంబీకులకు సమాచారం ఇచ్చి అప్పజెప్పారు. సతీష్ విద్యుత్ శాఖలో లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.